సాక్షి పెద్దపల్లి

బుధవారం । 1 । మార్చి । 2023



వార్షిక ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలి

ప్రణాళికాబద్ధంగా ముందుకుసాగి, బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని సింగరేణి డైరెక్టర్లు ఎన్వీకే శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. 8లో▸



మైనింగ్‌లో ఆవిష్కరణలు చేయాలి

మైనింగ్‌లో ఆవిష్కరణలు చేయాలని రామగుండం లోకల్ చాప్టర్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్(ఐఈఐ) చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
35.0/19.0

వాతావరణం

ఉదయం నుంచే ఎండవేడిమి పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతకు అవకాశముంది.

న్యూస్‌రీల్

ప్రజాసంబంధాలతో నేరాల నియంత్రణ



మాట్లాడుతున్న సీపీ రెమా రాజేశ్వరి

పెద్దపల్లిరూరల్: ప్రజా సంబంధాలతోనే నేరాల నియంత్రణ సాధ్యమని రామగుండం సీపీ రెమా రాజేశ్వరి అన్నారు. పెద్దపల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. సబ్ డివిజన్, సర్కిల్, స్టేషన్లవారీగా ఏసీపీ, సీఐ, ఎస్సైలతో మాట్లాడారు. స్టేషన్ల భౌగోళిక పరిస్థితులు, నేరాలు, పరిశ్రమలు, ప్రాజెక్టులు, సమస్యలపై ఆరా తీశారు. పోలీస్‌స్టేషన్ల వారీగా నమోదైన కేసులు, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ న్యాయం కోసం ఠాణాకు వచ్చే ప్రజల ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలన్నారు. నేరాలు జరిగాక ఛేదించడం కంటే అప్రమత్తంగా ఉండి నేరాలను కట్టడి చేయడమే మేలని సూచించారు. ప్రజల విశ్వాసం పొందేలా పోలీసు అధికారుల పనితీరు ఉండాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ ఆధారాలు అందుబాటులో ఉన్నాయని, వాటి ఆధారంగా దర్యాప్తు చేయాలన్నారు. సీసీ కెమెరా అవసరాలను ప్రజలు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులకు వివరిస్తూ ఏర్పాటు చేయడంలో భాగస్వాములను చేయాలన్నారు. సమావేశంలో డీసీపీ వైభవ్ గైక్వాడ్, ఏసీపీలు ఎడ్ల మహేశ్, గిరిప్రసాద్, బాలరాజు, మోహన్, సత్యనారాయణ, శ్రీనివాస్, అనిల్‌కుమార్, బాబురావు, కరుణాకర్, అశోక్‌కుమార్, శ్రవణ్‌కుమార్ తదితరులున్నారు.

ప్రైవేటీకరణను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలి



మాట్లాడుతున్న ముత్యంరావు

పెద్దపల్లిరూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ రంగ, వ్యవసాయరంగాన్ని ప్రైవేటీకరించేందుకు కుట్ర పన్నుతోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో మంగళవారం కార్మిక, కర్షక జిల్లా సదస్సును వేల్పుల కుమారస్వామి, గణేశ్, తిరుపతి అధ్యక్షతన నిర్వహించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్రం ఎత్తివేసేందుకు యత్నిస్తోందన్నారు. ఏప్రిల్ 5న కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల సంఘాల ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని తలపెట్టామని, విజయవంతం చేయాలని కోరారు. సురేశ్, రామాచారి, అంజయ్య, అరవింద్, యాకయ్య, శంకర్, వెంకటస్వామి, మహేశ్, మహేశ్వరి, రాజేశం, గట్టయ్య, రాజయ్య, రామ్మూర్తి, మల్లేశ్ తదితరులున్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



మహిళలతో మాట్లాడుతున్న విజయ్

జూలపల్లి: రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆరోపించారు. మండలంలోని వెంకట్రావుపల్లెలో హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమం చేపట్టారు. పేదల సంక్షేమానికి కాంగ్రెస్ అనేక పథకాలు అమలు చేసిందని గుర్తు చేశారు. నాయకులు ప్రకాశ్‌రావు, సతీశ్, కనుకుంట్ల అంజయ్య, లింగయ్య, మల్లెత్తుల కొమురయ్య, రాజేశ్వర్‌రావు, సంపత్‌రావు, నర్సింగరావు, మల్హల్‌రావు, సంతోష్ పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో 1492 మి.యూ విద్యుత్ ఉత్పత్తి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులో ఫిబ్రవరిలో 1,492 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని 72.0 శాతం (పీఎల్‌ఎఫ్) ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్‌గా పూర్తి చేసింది. 2600 మెగావాట్ల విద్యుత్ కేంద్రంలో ప్రస్తుతం 49.76 శాతం ఫ్రీక్వెన్సీతో 2,315 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతున్నట్లు సమాచారం. 200 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం గల మొదటి యూనిట్‌లో 203, రెండో యూనిట్‌లో 202, మూడో యూనిట్‌లో199 మెగావాట్లు, 500 మెగావాట్ల సామర్థ్యం గల నాలుగో యూనిట్‌లో 504, ఐదో యూనిట్‌లో 521, ఆరో యూనిట్‌లో 485, ఏడో యూనిట్‌లో 201మెగావాట్ల ఉత్పత్తి జరుగుతోంది.

సొమ్ము జిల్లాది.. తరలేది పక్క జిల్లాలకు





ఈ చిత్రంలో కనిపిస్తున్న గ్రంథాలయాల్లో అత్యాధునిక సౌకర్యాలతో కనిపించేది మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోనిది. మరొకటి సొంత భవనం లేక ఆర్‌అండ్‌బీ భవనంలో అరకొర వసతుల మధ్య నిర్వహిస్తున్నది పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని గ్రంథాలయం. సింగరేణి సంస్థ సీఎస్సార్ నిధుల నుంచి రూ.44 లక్షలు కేటాయించడంతో మహబూబాబాద్‌లో డిజిటల్ లైబ్రరీ, నిరుద్యోగులకు చదువుకోవడానికి సకల సౌకర్యాలతో నిర్మించారు. ప్రజాప్రతినిధుల ఒత్తిడి, పలుకుబడితో ఇతర ప్రాంతాలకు డీఎంఎఫ్‌టీ నిధులతోపాటు సీఎస్సార్ నిధులూ ఇతర జిల్లాలకు తరలిపోతున్నాయి.

- ఖనిజం ఇక్కడ.. ఖర్చు చేసేది ఎక్కడో..?
- డీఎంఎఫ్‌టీకి పక్క జిల్లాల ఎమ్మెల్యేల ఎసరు
- 2019 నుంచి డీఎంఎఫ్‌టీకి జమకాని సింగరేణి నిధులు
- నిబంధనల మేరకు ప్రభావిత గ్రామాల్లోనే ఖర్చు చేయాలి
- సింగరేణి సీఎస్సార్ నిధులు సైతం పక్క జిల్లాలకే..

డీఎంఎఫ్‌టీ నిధులు ఇలా..(లక్షల్లో)

జిల్లా	జీవో 112 ప్రకారం	సీఎంవో నోట్ ద్వారా	సింగరేణి బదిలీ	మొత్తం
జగిత్యాల	5,710	2,301	5,300	13,311
సిరిసిల్ల	2,300	3,192	350	5,842
సిద్దిపేట	821	0	0	821
హన్మకొండ	478	0	0	478
కరీంనగర్	2.4	0	500	502
భూపాలపల్లి	0	1,800	0	1,800
పెద్దపల్లి	36,701	0	0	36,701
మొత్తం	46,016	7,293	6,150	59,459

సాక్షి, పెద్దపల్లి: నల్ల బంగారానికి ప్రసిద్ధి చెందిన ఓపెన్‌కాస్ట్.. అండర్‌గ్రౌండ్ బొగ్గు గనులు, గ్రానైట్‌రాయి, ఇసుక ద్వారా జిల్లా మైనింగ్‌శాఖకు ఏటా వచ్చే ఆదాయం సుమారు రూ.వందల కోట్లపైనే. అపార ఖనిజ వనరులకు నెలవైన జిల్లా ప్రజలకు మాత్రం న్యాయంగా దక్కాల్సిన సొమ్ము పొరుగు జిల్లాలకు తరలిపోతోంది. రావాల్సిన నిధులూ జమకావడం లేదు. బొగ్గు, ఖనిజ, ఇసుక వనరుల తవ్వకాల ద్వారా వచ్చే ఆదాయంలో 30 శాతం సీనరేజి సొమ్ము జిల్లా మైనింగ్ అదనపు సంచాలకుడి ద్వారా ఈ మొత్తం జిల్లా ఖాతాలోకే చేరుతుంది. ఇలా వసూలయ్యే మొత్తం పెద్దపల్లి జిల్లాలో కాకుండా డిస్ట్రిక్ మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ (డీఎంఎఫ్‌టీ) ద్వారా ఇతర జిల్లాలోని నియోజకవర్గాల్లో ఖర్చవుతోంది. ఖనిజాలను కొల్లగొట్టడం ద్వారా దెబ్బతింటున్న ప్రాంతాలు, ప్రభావితం కాని ప్రాంతాల్లో 60:40 ఖర్చు చేయాలన్న నిబంధనల్లో జిల్లా మినరల్ ఫౌండేషన్ కమిటీ తమ ఇష్టానుసారంగా సవరణలు చేసుకుంది. ప్రభుత్వానికి రాష్ట్ర విస్తృత ప్రయోజనాలు ముఖ్యమనే పాయింట్‌ను తెరపైకి తెచ్చి జిల్లా, రాష్ట్రంలో ఎక్కడైనా ఖర్చు చేసుకోవచ్చని పొందుపరిచారు. ఈ లెక్కన పేరు పెద్దపల్లిది.. ఫలితం పలుకుబడి ఉన్న నేతల ప్రాంతాలదిగా మారింది.

2019నుంచి జమకాని నిధులు

2018లో నిబంధనలకు సవరణలు చేసి అన్ని కొత్త జిల్లాల్లో డీఎంఎఫ్‌టీ ఏర్పాటు చేశారు. పెద్దపల్లి స్థాయిలో మిగితా జిల్లాలకు ఆదాయ వనరులు లేకపోవడంతో ఈ నిధులనే ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన వెచ్చించాలని రాష్ట్రప్రభుత్వం 112 జీవో తీసుకొచ్చింది. సదరు జీవో సైతం ఒక్కసారికే నిధులు తరలించడానికని తీసుకొచ్చినా.. అదే సాకుగా సీఎంవో నుంచి లేఖలు తీసుకొచ్చి ఇతర ప్రాంతాలకు నేతలు నిధులను తరలిస్తున్నారు. జిల్లాలో డీఎంఎఫ్‌టీకి 2018 వరకు సుమారు రూ.713 కోట్లు జమయ్యాయి. దీంతో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన అప్పటి ఉమ్మడి జిల్లాలో హుస్నాబాద్ కొంతభాగం ఉందనే సాకుతో ప్రస్తుతం సిద్దిపేట జిల్లాలో ఉన్నా అక్కడ ఖర్చు చేశారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ పెద్దపల్లి జిల్లాలో ఖర్చుచేసే నిధుల్లో సైతం ఎక్కువ భాగం ధర్మపురి నియోజకవర్గంలోని ధర్మారం మండలంలోనే ఖర్చు చేయడం గమన్హారం. కొవిడ్ సమయంలో 2020లో రాష్ట్ర ప్రభుత్వం రూ.198 కోట్లు, మరోసారి రూ.123 కోట్ల రూపాయలు తీసుకుంది. అయితే సింగరేణి సంస్థ 2019 డిసెంబర్ వరకు మాత్రమే డబ్బులు జమ చేసింది. ఆ సంస్థ నుంచి డీఎంఎఫ్‌టీకి సుమారు రూ.400 కోట్ల బకాయిలున్నాయి. దీంతో గతంలో డీఎంఎఫ్‌టీ కింద పనులు చేసిన వారికి బిల్లులు చెల్లించే పరిస్థితి కనబడటం లేదు. దీంతో కాంట్రాక్టర్లు త్వరితగతిన పనులు చేయటం లేదు. ఖనిజ వనరులు ఉన్న ప్రాంతాల్లో కాకుండా ఇతర ప్రాంతాల్లో వినియోగిస్తున్నారనే విమర్శల నేపథ్యంలో గతేడాది ఫిబ్రవరిలో ఎక్కడి నిధులు అక్కడే వినియోగించుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కానీ జిల్లా డీఎంఎఫ్‌టీ కమిటీ తెలియకుండానే నిధులు పక్కదారి పట్టిస్తున్నారని, అందుకే సింగరేణి నిధులు జమ చేయటం లేదని స్థానిక కార్మిక నేతలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పలుకుబడి ప్రజాప్రతినిధుల ఒత్తిడితో..

డీఎంఎఫ్‌టీ, సీఎస్సార్ నిధుల వినియోగంపై నేతల ఒత్తిడితో వారు సూచించిన ప్రాంతాలకు కేటాయింపులు జరుగుతున్నాయి. ప్రభావిత ప్రాంతాల్లోనే సామాజిక బాధ్యత కింద ఖర్చు చేయాల్సి ఉండగా.. సింగరేణి పరిధి కాకున్నా ఇతర ప్రాంతాల్లో ఖర్చు చేస్తున్నారు. ఉదాహరణకు.. సిద్దిపేటలో క్రీడామైదానం నిర్మాణానికి రూ.కోటి, ఖమ్మం పోలీసు కమిషనరేట్ సుందరీకరణకు రూ.16 లక్షలు, జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో సీసీ కెమెరాలకు రూ.75లక్షలు, ఇలా ఇతర జిల్లాల్లో ఖర్చు చేస్తున్నారు.

ఇది అన్యాయం



సహజ వనరులు తవ్వకాలు జరిపిన ప్రాంతాల్లోనే డీఎంఎఫ్‌టీ, సీఎస్సార్ నిధులు ఖర్చు చేయాలి. దుమ్ము, ధూళి, ఇతరత్రా కాలుష్యాల బారిన పడకుండా స్థానిక ప్రజలను రక్షించేందుకు ఈ నిధులు ఖర్చు చేయాలి. బొగ్గు తీయడం ద్వారా ఏర్పడిన కాలుష్యాన్ని నివారించేందుకు ప్రభావిత, నిర్వాసిత గ్రామాల్లో వెచ్చించాల్సి ఉండగా.. ఇందుకు విరుద్ధంగా జరగడం జిల్లా ప్రజలకు తీరని అన్యాయం చేసినట్లే.

– వాసిరెడ్డి సీతారామయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

నేతలు ఎగరేసుకుపోతున్నారు



సింగరేణి యాజమాన్యం ఇష్టారీతిన వ్యవహరిస్తోంది. సింగరేణి కన్నుసన్నుల పరిధిలో జరగాల్సిన పనులను కలెక్టర్లకు అప్పగించడంతో బలమైన నేతలు తరలించుకుపోతున్నారు. ఈ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. డీఎంఎఫ్‌టీ నిధులను ఉమ్మడి జిల్లాలకు పంచాలని జీవో తీసుకొచ్చారు. ఇటీవల సీఎంవో ఏజిల్లాలో నిధులు ఆ జిల్లాలోనే వినియోగించాలని జీవో తీసుకొచ్చినా ఇంకా కొంత మంది నేతలు సిఫారసుల ద్వారా తరలించుకుపోతున్నారు.

– రియాజ్ అహ్మద్, హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు

పారదర్శకంగా ప్రజా పంపిణీ

- ఈ–పాస్ పద్ధతినే రేషన్
- ఇబ్బందుల్లేకుండా ధాన్యం సేకరణ
- ఆదేశాలందితేనే రేషన్‌కార్డుల్లో పేర్ల నమోదు
- 'సాక్షి'తో జిల్లా పౌర సరఫరాల అధికారి తోట వెంకటేశ్



పెద్దపల్లిరూరల్: 'జిల్లాలో ప్రజాపంపిణీ వ్యవస్థను పారదర్శకంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకున్నాం. ఈ–పాస్ పద్ధతిన పంపిణీ చేస్తున్నాం. కొన్ని ప్రాంతాల్లో లబ్ధిదారుల నుంచి సేకరించిన రేషన్ బియ్యం అక్రమ పద్ధతుల్లో ఇతర ప్రాంతాలకు రవాణా అవుతున్నాయి. అలాంటివాటిని పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నాం. రైతులు పండించిన నాలుగు లక్షల టన్నుల ధాన్యాన్ని 291 కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి రైతులకు డబ్బులు చెల్లించాం. రైస్‌మిల్లర్ల నుంచి సీఎంఆర్ సేకరణకు చర్యలు తీసుకుంటున్నాం..' అని జిల్లా పౌర సరఫరాల అధికారి తోట వెంకటేశ్ తెలిపారు. రేషన్‌కార్డుల జారీ, కొత్త పేర్ల నమోదు తదితర అంశాలపై మంగళవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు.

సాక్షి: ప్రజాపంపిణీ వ్యవస్థ ఎలా సాగుతోంది..?

డీఎస్‌ఓ: ప్రజా పంపిణీ పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. 2017 నుంచి ఈ–పాస్ పద్ధతిన లబ్ధిదారులకు అందిస్తున్నాం.

సాక్షి: వేలిముద్రలు సరిగా పడని వారి పరిస్థితి..?

డీఎస్‌ఓ: రేషన్‌కార్డులో పేర్లు నమోదై ఉన్న వారిలో ఎవరైనా సరుకులు పొందొచ్చు. వేలిముద్రలు, ఐరిష్ పనిచేయకపోతే ఓటీపీ ద్వారా తీసుకోవచ్చు.

సాక్షి: రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తున్న వారిపై చర్యలేంటి..?

డీఎస్‌ఓ: లబ్ధిదారుడి ప్రమేయం లేకుండా రేషన్ బియ్యం బయటకు వచ్చే ఆస్కారం లేదు. ఈ–పాస్ ద్వారా పంపిణీ చేయడమే ఇందుకు కారణం. అయినా ఇతర ప్రాంతాలకు అక్రమ పద్ధతుల్లో తరలిస్తున్న వారిని పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నాం.

సాక్షి: కొత్త రేషన్ కార్డులందిస్తున్నారా. పేర్ల నమోదుకు అవకాశముందా..?

డీఎస్‌ఓ: ప్రస్తుతానికి కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకునే వెబ్‌సైట్ అందుబాటులో లేదు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ కార్డులందాయి. కార్డుల్లో కొత్తగా పేర్ల నమోదు కోసం అందిన దాదాపు 12వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆదేశాలు అందగానే జారీ చేస్తాం.

సాక్షి: ధాన్యం కొనుగోలు ఎలా సాగింది..?

డీఎస్‌ఓ: ఈ సీజన్‌లో ధాన్యం కొనుగోలు సాఫీగానే సాగింది. నాలుగు లక్షల టన్నుల కొనుగోళ్లు 291 కేంద్రాల ద్వారా చేశాం. రైతులకు డబ్బు కూడా చెల్లించాం.

సాక్షి: సీఎంఆర్ రైస్ సేకరణ పూర్తయిందా...?

డీఎస్‌ఓ: లేదు.. పురోగతిలో ఉంది. వానకాలం సీజన్‌కు సంబంధించి 83శాతం.. యాసంగికి సంబంధించి 74శాతం పూర్తయింది. మిగతా వాటిని వీలైనంత త్వరగా పూర్తి చేసేలా మిల్లర్లను ఆదేశించాం.

నాణ్యమైన భోజనం అందించాలి

- వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటాం
- హాస్టల్‌లో మెస్ కమిటీ ఏర్పాటు
- జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రంగారెడ్డి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రం శివారు రంగంపల్లి బీసీ కాలేజీ బాలుర వసతి గృహాన్ని మంగళవారం జిల్లా బీసీ సంక్షేమ అధికారి రంగారెడ్డి, ఏబీసీడబ్ల్యూవో వినోద్‌కుమార్ సందర్శించారు. హాస్టల్‌లో భోజనం నాణ్యతగా ఉండడం లేదంటూ విద్యార్థులు సోమవారం రాత్రి రోడ్డెక్కిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో హాస్టల్ ఆవరణలో విద్యార్థులతో సమావేశమై మాట్లాడారు. హాస్టల్‌లో మరుగుదొడ్లు సరిగాలేవని, నల్లాలు లీకేజీ అవుతున్నాయంటూ విద్యార్థులు అధికారుల దృష్టికి తెచ్చారు. వంట సరిగా చేయడం లేదని, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఇంటి యజమానితో మాట్లాడి మరమ్మతు చేయిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. వంటలు నాణ్యతగా చేయాలని, విద్యార్థుల నుంచి ఫిర్యాదులు ఉండొద్దని సిబ్బందిని హెచ్చరించారు. హాస్టల్‌లో మెస్ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. ఆ కమిటీ సూచనలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. విద్యార్థులు కూడా తమ సమస్యలను స్థానిక వార్డెన్ దృష్టికి తేవాలని, తొందరపాటుతో రాత్రి సమయాల్లో రోడ్లపైకి రావడం సరి కాదని పేర్కొన్నారు. విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వారి వెంట వార్డెన్ అశోక్ ఉన్నారు.

ప్రజా సమస్యలు పక్కనబెట్టిన ఎమ్మెల్యే

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాగూర్



మంగళహారతులతో మహిళల స్వాగతం

గోదావరిఖని: సమస్యలను పక్కనబెట్టి స్వలాభాపేక్షకు ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పెద్దపీట వేస్తున్నారని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్.రాజ్ ఠాగూర్ విమర్శించారు. మంగళవారం స్థానిక 46వ డివిజన్‌లో పర్యటించారు. అర్హులైన నిరుపేదలకు ఎమ్మెల్యే మొండిచేయి చూపిస్తున్నారని విమర్శించారు. డివిజన్లలో ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన పథకాలు ఒక్కటీ లేవన్నారు. కాంగ్రెస్ గెలిస్తే వరంగల్ డిక్లరేషన్‌ను పూర్తి స్థాయిలో అమలు పరచి బంగారు తెలంగాణాకు బాటలు వేస్తామన్నారు. ఒక్కసారి అవకాశం కల్పిస్తే ఈప్రాంతాన్ని అన్నిరంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దుతామన్నారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొంతల రాజేశ్, మాదరబోయిన రవికుమార్, ఎండీ ముస్తఫా, మహంకాళీ స్వామి, గాధం విజయానంద్, చుక్కల శ్రీనివాస్, పాతిపెల్లి రవి, బొమ్మక రాజేశ్, తాళ్లపల్లి యుగేందర్, నజీముద్దీన్, గట్ల శారద, సొల్లు రామస్వామి, చందు, యాకూబ్, ఆడెపు దశరథం, అడప సాయికిరణ్ పాల్గొన్నారు.

సీఎంఆర్.. ఇదేం తీరు?

- గడువు మీద గడువు పెంపు
- అయినా అందని బియ్యం
- 100 శాతం మిల్లింగ్‌పై సందేహాలు
- ప్రభుత్వ ధాన్యంతోనే దందా
- నామమాత్రపు పర్యవేక్షణ.. చర్యలు కరువు

ఉమ్మడి జిల్లాలో సీఎంఆర్ తీరిలా (మెట్రిక్ టన్నుల్లో)

జిల్లా	లక్ష్యం	బకాయి
కరీంనగర్	2,65,228	43,729
పెద్దపల్లి	3,95,431	54,938
జగిత్యాల	1,01,480	36,377
రాజన్న సిరిసిల్ల	98,456	15,403



ఏడాది క్రితం రామడుగులో అక్రమాలు వెలుగుచూసిన మిల్లు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: గడువుల మీద గడువు పెంచుతున్నా మిల్లర్లలో మార్పులేదు. పలువురు మిల్లర్లు మరాడించిన బియ్యాన్ని వక్రమార్గం పట్టిస్తుండగా కఠినచర్యలు కరువవడం ఆందోళనకర పరిణామం. ఏళ్లుగా బకాయి ఉన్న మిల్లర్లు ఉండగా ఇంకా సదరు వసూలులో ఎనలేని నిర్లక్ష్యం విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని మరాడించి బియ్యంగా ఇవ్వాలని రైస్‌మిల్లులకు సరఫరా చేయడం ప్రతి యాసంగి, వానాకాలం సీజన్‌లో జరిగే తంతు. అధికారులతో ఉన్న అనుబంధమో మరేమో కానీ పలు మిల్లులు ఇంకా సీఎంఆర్ ఇవ్వడంలో అట్టడుగున ఉండటం శోచనీయం. మంగళవారంతో గడువు ముగిసిన నేపథ్యంలో మిలర్లు వందశాతం మిల్లింగ్ చేసి ఇస్తారా? అన్నది అనుమానమే. మళ్లీ గడువు పెంపుపైనే పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది.

మరో రెండు రోజుల్లో మరాడించి ఇస్తారా?

ఒక సీజన్‌కు సంబంధించిన కోటాను తర్వాతి సీజన్ సరుకు చేతికందే నాటికి పూర్తి చేయాలి. కానీ ప్రభుత్వం వివిధ కారణాలతో గడువు పొడిగిస్తుండటం మిల్లర్లకు లాభిస్తోంది. కేటాయించిన సీఎంఆర్ ప్రకారం వందశాతం సరఫరా చేయాలని ప్రభుత్వం ఇప్పటికే పలుమార్లు గడువు పొడిగించింది. గత నెల రోజుల క్రితం మరోసారి అవకాశమిస్తూ ఫిబ్రవరి 28 వరకు తుది గడువుగా పేర్కొన్నారు. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల అధికారులు ఈ మేరకు జిల్లా స్థాయిలో మిల్లర్లతో సమీక్షలు నిర్వహిస్తున్నా మార్పు అంతంతే. మార్చి నెలాఖరు నాటికి యాసంగి ధాన్యం చేతికందనుండగా ఆ లోపు సీఎంఆర్ పూర్తవడం కష్టమే.

పెట్టుబడి లేని దందా

ఉమ్మడిజిల్లాలో పలు రైస్‌మిల్లులు రేషన్ బియ్యానికి అడ్డాగా మారాయి. రేషన్ బియ్యం కొనుగోలు చేసి వాటిలోనే కర్నెల్స్ కలిపి ఎఫ్‌సీఐకి తరలిస్తున్నట్లు తెలుస్తోంది. కేటాయించిన సీఎంఆర్ లక్ష్యం మేరకు బియ్యాన్ని అప్పగిస్తే దందా చేసుకునేందుకు అవకాశముండదు. ఒకవేళ మిల్లులో తనిఖీలు జరిగితే డొల్లతనం బయటపడుతుందన్న కారణంతో సదరు కిటుకును ఉపయోగించి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలు, జిల్లాలకు తరలిస్తున్నారు. ప్రభుత్వ సొమ్ముతో దర్జాగా దందా చేస్తుండగా మిల్లర్లకు కాసుల వర్షం కురుస్తోంది. గతంలో కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని ఓ రైస్‌మిల్లుకు ప్రభుత్వం సరఫరా చేసిన ధాన్యమే లేకపోవడాన్ని గుర్తించి అధికారులు కంగుతిన్నారు. ఒక ఏసీకేకు 270 క్వింటాళ్లు కాగా 14 ఏసీకేలకు గానూ 3,780 క్వింటాళ్లు. 14 ఏసీకేలకుగానూ క్వింటాల్ ధాన్యం లేకపోవడం.. రికార్డులను తరచిచూస్తే ఎఫ్‌సీఐకి సరఫరా చేసిన బియ్యమే లేకపోవడంతో నిర్ఘాంతపోవడం అధికారుల వంతయ్యింది.

గాడి తప్పిన పర్యవేక్షణ

2019 వానాకాలంలో సీఎంఆర్ కోటా పూర్తి చేయని మిల్లులను బ్లాక్‌లిస్టులో పెట్టారు. ఉమ్మడి జిల్లాలోని పలు మిల్లుల్లో ధాన్యం మాయంచేయగా సదరు డబ్బులు చెల్లించడంతో బ్లాక్‌లిస్ట్ నుంచి బయటపడ్డాయి. నాలుగు జిల్లాల్లో సుమారు 350 మిల్లులు ఇంకా బకాయిలు ఉన్నాయి. 10 ఏసీకేల నుంచి 20 ఏసీకేల వరకు మిల్లులు బకాయి ఉండటం పర్యవేక్షణ తీరుకు అద్దం పడుతోంది. సివిల్ సప్లయ్ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షణ చేయాల్సి ఉండగా అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలే లేవు. పలుకుబడి మిల్లర్లు సీఎంఆర్‌తో వ్యాపారం చేస్తున్నట్లు పౌరసరఫరాల విజిలెన్స్, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ దాడుల్లో పలుమార్లు వెల్లడైంది.

కేసులైనా మార్పేదీ..?

2011–12 నుంచి 2014–16 వరకు ఉమ్మడి జిల్లా పరిధిలో 18మిల్లులు సీఎంఆర్ కింద ఇవ్వాల్సిన 90,407 క్వింటాళ్ల బియ్యాన్ని ఇవ్వలేదు. సదరు మిల్లులపై పౌరసరఫరాలశాఖ గతంలోనే కేసులు నమోదు చేయించింది. కేసులు నమోదై ఏళ్లు గడుస్తున్నా ఒక్క మిల్లరు బకాయి సీఎంఆర్ ఇవ్వకపోవడం పర్యవేక్షణ తీరుకు తార్కాణం. రెవెన్యూ రికవరీ(ఆర్ఆర్) యాక్ట్ ప్రయోగిస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించినా మిల్లర్లలో మార్పు లేదు. సదరు యాక్ట్ కింద మిల్లుల ఆస్తుల వేలం వేసైనా ఆ మొత్తం వసూలు చేయొచ్చు. కాగా సీఎంఆర్ బకాయిలను వసూలు చేస్తామని, కోర్టుకు వెళ్లడం వల్ల ఆలస్యమవుతోందని పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు.

క్లుప్తంగా

ఉద్యోగ విరమణ డీపీఎంకు సన్మానం



రాజమౌళిని సన్మానిస్తున్న ఆర్జీ–2 జీఎం మనోహర్

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సింగరేణి ఆర్జీ–2 జీఎం కార్యాలయంలో డిప్యూటీ పర్సనల్ మేనేజర్ కొత్త చంద్రమౌళి ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా మంగళవారం యైటింక్లయిన్‌కాలనీ ఆర్యవైశ్య సంఘం నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాజమౌళి దంపతులను జీఎం మనోహర్ గజమాలతో సత్కరించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అనంతుల రాజు, నాయకులు కండెం సురేష్, లచ్చయ్య, అశోక్, దేవయ్య, సతీశ్, జయరాజ్, శ్రీనివాస్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఆమె నేత్రాలు సజీవం



కాంతమ్మ (ఫైల్)

రామగిరి(మంథని): ముత్తారం మండలంలోని కేశనపల్లి గ్రామానికి చెందిన మందల కాంతమ్మ(85) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. కుటుంబసభ్యులు ఆమె నేత్రాలను చేశారు. ఈ సందర్భంగా సదాశాయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి మాట్లాడుతూ.. కాంతమ్మ నేత్రాలను మట్టిలో కలిసిపోకుండా మరో ఇద్దరికి చూపునిచ్చేందుకు దానం చేయడం హర్షణీయమన్నారు. ఆమె కాంతమ్మ కుమారుడు రవీందర్ రెడ్డి, కోడలు విజయలక్ష్మిలను అభినందించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

రామగుండం: స్థానిక రైల్వేస్టేషన్‌కు సమీపంలో సోమవారం అర్ధరాత్రి రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు జీఆర్పీ ఔట్ పోస్టు ఇన్‌చార్జి గంగారపు తిరుపతి తెలిపారు. మృతుడి వయసు సుమారు 40 ఏళ్లు ఉంటుందని, గ్రీన్, బ్లాక్, వైట్ లైన్స్ ఫుల్ షర్ట్, పెసర రంగు లోయర్ ప్యాంట్ ధరించాడని, చామన ఛాయ రంగు కలిగి ఉన్నాడని పేర్కొన్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో మృతదేహాన్ని గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. వివరాలు తెలిసినవారు 99493 04574, 94407 00039 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు

గోదావరిఖని: ట్రాఫిక్ పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు గోదావరిఖని వన్‌టౌన్ సీఐ రమేష్‌బాబు తెలిపారు. స్థానిక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏఎస్సై వెంకటేశ్వరబాబు గత నెల 27న గోదావరిఖని లక్ష్మీనగర్‌లో విధులు నిర్వర్తిస్తుండగా రాంగ్ పార్కింగ్ చేసి, నంబర్ ప్లేట్ లేని మోటార్ సైకిల్‌ని టోయింగ్ వెహికిల్‌తో ఎక్కించారు. మోటార్‌సైకిల్ ఓనర్ కాల్వ తిరుపతియాదవ్, ఓ మైనర్ వాగ్వివాదానికి దిగినట్లు పేర్కొన్నారు. ట్రాఫిక్ ఏఎస్సైతో గొడవకు దిగి దుర్భాషలాడిన కాల్వ తిరుపతి, అతని కొడుకుపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఏఎస్సై ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

బయోమెట్రిక్ మెషీన్ చోరీ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని అప్పన్నపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బయోమెట్రిక్ మెషీన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు హెచ్‌ఎం సుజాత తెలిపారు. ఆయా మంగళవారం ఉదయం పాఠశాలను శుభ్రం చేసేందుకు రాగా తలుపులు తెరిచి ఉన్నాయని, లోపల ఉండాల్సిన బయోమెట్రిక్ మెషీన్ కనిపించలేదని పేర్కొన్నారు. ఈ ఘటనపై ఆమె బసంత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పెద్దపల్లి పట్టణ అభివృద్ధికి పాటుపడండి

- దుబారా తగ్గించాల్సిందే.. ● ఆదాయ వనరులు పెంచుకోవాలి
- పన్నుల వసూలుపై శ్రద్ధ చూపాలి ● పార్క్ ఏర్పాటుకు చర్యలు
- మున్సిపల్ సమావేశంలో కలెక్టర్ సంగీత



మాట్లాడుతున్న కలెక్టర్ సంగీత

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా ముందుకుసాగాలని కలెక్టర్ సంగీత అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగిన బడ్జెట్ సమావేశంలో కలెక్టర్ సంగీత, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ పాల్గొన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 2925.72లక్షల అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా.. సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. వందశాతం పన్నులు వసూలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దుబారా ఖర్చులు తగ్గించి ప్రణాళికాబద్ధంగా పట్టణాభివృద్ధికి పాటుపడాలన్నారు. పెద్దపల్లిలో పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చైర్‌పర్సన్ మమతారెడ్డి తెలిపారు. బస్ డిపో ఏర్పాటుకు స్థల సేకరణ జరపాలని కలెక్టర్‌ను కోరగా ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. మొత్తం 2925.72లక్షల ఆదాయం అంచనా వేయగా 1022.95 లక్షల సాధారణనిధుల అంచనావ్యయం, 1074.99లక్షల ప్లాన్, నాన్‌ప్లాన్ అంచనా వ్యయంగా నమోదు చేసినట్లు వివరించారు. వైస్ చైర్మన్ నాజ్మీన్‌సుల్తానా, పాలకమండలి సభ్యులు, కో–ఆప్షన్‌సభ్యులు పాల్గొన్నారు.

రూ.10.11 కోట్ల అంచనా బడ్జెట్‌కు ఆమోదం

- మున్సిపల్ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ
- మంథని బల్దియా చైర్‌పర్సన్ పుట్ట శైలజ



బడ్జెట్‌పై చర్చిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శైలజ, పాలకవర్గ సభ్యులు

మంథని: మంథని మున్సిపాలిటీ అభివృద్ధికి గాను 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.10కోట్ల 11లక్షల ఎనిమిది వేల అంచనా బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పుట్ట శైలజ అధ్యక్షతన మంగళవారం బడ్జెట్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అంచనా బడ్జెట్ అంశాలను చర్చించిన అనంతరం సభ్యులు ఆమోదించారు. మున్సిపల్ సాధారణ నిధుల నుంచి ఈ ఆర్థిక సంవత్సరం రూ.346.06 లక్షలు, ప్రభుత్వ గ్రాంట్ల ద్వారా రూ.609లక్షలు సమకూరుతుందని అంచనా వేశారు. అంచనా బడ్జెట్‌తోపాటు ఆయా శాఖల ద్వారా సమకూరిన నిధుల నుంచి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపడుతామని చైర్‌పర్సన్ శైలజ తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, కమిషనర్ శారద, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు ఉన్నారు.

మత్స్యపారిశ్రామిక సంఘానికి నిధుల మంజూరుకు వినతి

మంథని మత్స్యపారిశ్రామిక సహకార సంఘం కార్యాలయం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆ సంఘం అధ్యక్షుడు పోతరవేని క్రాంతికుమార్ మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందించారు. రూ.10లక్షలు కేటాయించి సంఘం అభివృద్ధికి తోడ్పాడాలని కోరారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి

- అనవసర ఖర్చులు తగ్గించుకోండి
- ఆదాయ వనరులు మెరుగుపర్చుకోవాలి
- బల్దియా సమావేశంలో కలెక్టర్ సంగీత వెల్లడి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సునీత

సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలో వందశాతం పన్నులు వసూలు చేయాలని కలెక్టర్ సంగీత అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ ముత్యం సునీత అధ్యక్షతన 2023–24 బడ్జెట్ సమావేశం నిర్వహించారు. రూ.1270.74 లక్షలతో ప్రవేశపెట్టగా కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అనవసర ఖర్చులు తగ్గించుకోవాలని, ఆదాయ వనరులు మెరుగు పర్చుకోవాలని సూచించారు. ప్రతి వార్డులో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ వందశాతం పన్ను వసూలు చేసుకోవాలన్నారు. మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ అలీముద్దీన్ బడ్జెట్ ఆదాయ, వ్యయాలను వివరించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత, కౌన్సిలర్లు పసెడ్ల మమత, గాజుల లక్ష్మీ, నిషాద్, పారుపల్లి జ్ఞానేశ్వరి, కూకట్ల గోపి, చింతల సునీత, గొట్టం లక్ష్మీ, అనుమల అరుణ, రెవెల్లి తిరుపతి, దున్నపోతుల రాజయ్య, గుర్రాల శ్రీనివాస్, కో–ఆప్షన్ సభ్యులు సాజీద్, ఫాతిమా, మెంగాని రాధ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వార్షిక ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో డైరెక్టర్ల దిశానిర్దేశం



వీసీలో జీఎం నారాయణ, అధికారులు

గోదావరిఖని(రామగుండం): మరో నెల రోజుల గడువు మాత్రమే ఉన్న నేపథ్యంలో ప్రణాళికాబద్ధంగా ముందుకుసాగి, బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని సింగరేణి డైరెక్టర్లు ఎన్వీకే శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. మంగళవారం సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణాపై అప్రమత్తంగా ఉండాలన్నారు. నష్టాన్ని తగ్గించేందుకు వార్షిక లక్ష్యాలను సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్జీ–1 జీఎం కె.నారాయణ, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, ఐఈడీ డీజీఎం ఆంజనేయులు, ఏజెంట్ చిలక శ్రీనివాస్, ఎస్ఈ దాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే ఆర్జీ–2 ఏరియా జీఎం మనోహర్ ఇతర అధికారులతో బొగ్గు ఉత్పత్తిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. నెల రోజుల్లో వార్షిక లక్ష్యాలు సాధించడానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. రక్షణలో విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, సీహెచ్‌పీ నుంచి అత్యధిక బొగ్గు రవాణా చేయాలని సూచించారు. ప్రాజెక్టు ఇంజినీర్ దుర్గాప్రసాద్, ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ–1లో లక్ష్యాన్ని మించి బొగ్గు ఉత్పత్తి

బొగ్గు ఉత్పత్తిలో ఆర్జీ–1 ఏరియా దూకుడుగా ముందుకెళ్తోందని జీఎం కె.నారాయణ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 41 రోజుల ముందుగానే వార్షిక లక్ష్యాన్ని సాధించి రికార్డు నెలకొల్పినట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం ఫిబ్రవరి చివరి నాటికి 32.24 లక్షల టన్నులకు గాను 40.46 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి, సింగరేణిలోనే నంబర్ వన్‌గా నిలిచిందని పేర్కొన్నారు. ఏరియాలోని జీడీకే–5 ఓసీపీ భారీగా బొగ్గు వెలికితీసి, 130 శాతంలో నిలిచిందన్నారు. కాగా జీడీకే–11 గనిలోని కంటిన్యూస్ మైనర్–1 యంత్రం కేవలం 38 శాతం బొగ్గు వెలికితీసిందని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి చివరి నాటికి 44.20 శాతం బొగ్గు ఉత్పత్తి సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, డీజీఎంఎస్ నిబంధనలకు మేరకు జీడీకే–5 ఓసీపీలో దుమ్ము లేవకుండా ఏర్పాట్లు కొనసాగుతున్నాయని చెప్పారు. అలాగే బ్లాస్టింగ్‌ల వల్ల సమీప గ్రామాల ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. డీజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణ, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, ఫైనాన్స్ డీజీఎం రామకృష్ణ, సివిల్ డీజీఎం నవీన్, ఏరియా వర్క్‌షాప్ డీజీఎం మదన్‌మోహన్, ఐఈడీ డీజీఎం ఆంజనేయులు, ఏజెంట్లు సైదులు, చిలక శ్రీనివాస్, సీనియర్ పీవో సారంగపాణి, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వండి

- హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్‌అహ్మద్



మాట్లాడుతున్న రియాజ్‌అహ్మద్

గోదావరిఖని(రామగుండం): సెక్యూరిటీ కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్‌అహ్మద్ డిమాండ్ చేశారు. మంగళవారం గోదావరిఖనిలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనిఫాంను క్లాత్ కాంట్రాక్టర్ లేదా యాజమాన్యం ఇవ్వాలన్నారు. మెడికల్ ట్రీట్‌మెంట్, ఉచిత వీటీసీ ఇస్తామని అధికారులు చెప్పారని, వాస్తవానికి మరోలా జరుగుతోందని ఆరోపించారు. నెలకోసారి సేఫ్టీ, వర్క్ కమిటీల మీటింగ్ పెట్టాలన్నారు. ప్రతినెలా 3వ తేదీలోగా జీతాలు చెల్లించాలని, కాంట్రాక్టర్లు ఇవ్వకపోతే యాజమాన్యమే బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని కోరారు. సెక్యూరిటీగార్డులకు పే, సీఎంపీఎఫ్ స్లిప్‌లు ఇవ్వాలన్నారు. అనంతరం ప్రైవేట్ సెక్యూరిటీగార్డుల కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

'వారసత్వ' ఘనత సీఎం కేసీఆర్‌దే

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్



ప్రదర్శనలు తిలకిస్తున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని(రామగుండం): కారుణ్య నియామకాల ద్వారా వారసత్వ ఉద్యోగాలు కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. మంగళవారం జీడీకే–2ఏ గనిలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన కార్మిక కుటుంబాలను ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో కార్మికులు వారసత్వ ఉద్యోగ హక్కు కోల్పోయారని తెలిపారు. తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ వారసత్వ హక్కును తిరిగి అమలయ్యేలా కృషి చేశారని పేర్కొన్నారు. కార్మికుల సొంతింటి నిర్మాణం కోసం రూ.10 లక్షల వడ్డీ లేని రుణం అందేలా చేశారన్నారు. టీబీజీకేఎస్ నాయకులు దాసరి నర్సయ్య, శేషగిరి, మధుబాబు, సాయి, సతీశ్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు దేశం గర్వపడే స్థాయికి ఎదగాలి

గోదావరిఖనిటౌన్(రామగుండం): విద్యార్థులు చిన్నప్పటి నుంచి బాగా చదివి, భవిష్యత్‌లో దేశం గర్వపడే స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. నేషనల్ సైన్స్ డే సందర్భంగా గోదావరిఖని పట్టణంలోని ఆఫిల్ కిడ్స్ పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సైన్స్ ఫేర్‌ను ఆయన ప్రారంభించారు. విద్యార్థుల ప్రదర్శనలు వీక్షించి, అభినందించారు. కార్పొరేటర్ బాలరాజ్‌కుమార్, సింగరేణి ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ కిరణ్‌రాజ్‌కుమార్, లయన్స్ క్లబ్ బాధ్యులు గంగాధర్, దయానంద్ గాంధీ, ఐలయ్య, సోమారపు అరుణ్‌కుమార్, లావణ్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోమేటిక్ స్టార్టర్ల ధ్వంసంపై నిరసన



ధర్నా చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, నాయకులు

ధర్మారం(ధర్మపురి): రైతులు వ్యవసాయ బావులకు ఏర్పాటు చేసుకున్న ఆటోమేటిక్ స్టార్టర్లను విద్యుత్ శాఖ అధికారులు ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం ధర్మారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ధర్నా చేపట్టారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 24 గంటల త్రీ ఫేజ్ కరెంట్ ఇస్తున్నామని చెబుతూ 4 గంటలు కూడా ఇవ్వడం లేదన్నారు. అది కూడా ఇష్టం వచ్చిన సమయంలో సరఫరా చేస్తోందని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో మోటార్లకు రైతులు ఆటోమేటిక్ స్టార్టర్లు ఏర్పాటు చేసుకోవడం తప్పనిసరైందని పేర్కొన్నారు. అధికారులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి, స్టార్టర్లను ధ్వంసం చేయడం అన్యాయమన్నారు. మరోసారి ఇలా చేస్తే ఊరుకునేదిలేదని హెచ్చరించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్, బ్లాక్–2 అధ్యక్షుడు కోమటిరెడ్డి రవీందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్, నాయకులు మోటపలుకుల అశోక్, కాంపెల్లి రాజేశం, మెండె మహేందర్, నారా లక్ష్మణ్, పోల్‌దాసరి సంతోష్, మహమ్మద్ అష్రఫ్, గౌడ గోవింద్, లావుడ్య కుమార్ పాల్గొన్నారు.

'బ్రిలియంట్' చైర్మన్‌కు ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ మెడల్



మెడల్ తీసుకుంటున్న సత్యనారాయణ

ధర్మారం(ధర్మపురి): మండల కేంద్రంలోని చెందిన బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్ సిరిపురం సత్యనారాయణకు అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీలో పదవులు లభించాయి. మూడు రోజులు విశాఖపట్టణంలో జరిగిన క్లబ్ ఇంటర్నేషనల్ వార్షికోత్సవాల్లో జిల్లా గవర్నర్‌గా ఉన్న సత్యనారాయణను ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్, సోత్‌జోన్ మల్టిపుల్ జాయింట్ ట్రెజరర్‌గా నియమించారు. అంతేకాకుండా క్లబ్‌లో విశిష్ట సేవలందించినందుకు గాను ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ మెడల్‌ను ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఏవీఎం.రావు చేతులమీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గవర్నర్ సిరిపురం రాజేశ్, క్లబ్ ధర్మారం అధ్యక్ష, కార్యదర్శులు తాళ్లపెల్లి సురేందర్, మామిడిశెట్టి శ్రీనివాస్, పీఆర్‌వో అమరపెల్లి నారాయణ, అంతర్జాతీయ నాయకులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీకి వృద్ధురాలి పార్థివదేహం



కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖని శివాజీ నగర్‌కు చెందిన దేవకి తన మరణానంతరం శరీరదానం చేస్తానని గతంలో సదాశయ ఫౌండేషన్‌కు అంగీకార పత్రం అందజేశారు. ఈ క్రమంలో ఆమె తీవ్ర అనారోగ్యంతో సోమవారం సాయంత్రం మృతి చెందింది. దేవకి కోరిక మేరకు కుటుంబసభ్యులు సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులకు సమాచారం ఇచ్చారు. మంగళవారం వారి ఆధ్వర్యంలో టెక్నీషియన్ ఆరిఫ్ దేవకి నేత్రాలను సేకరించి, హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంక్‌కు పంపించారు. పార్థివదేహాన్ని మెడికల్ కాలేజీ అనాటమీ విభాగం ప్రొఫెసర్లకు అప్పగించారు. కార్యక్రమంలో జీజీహెచ్ ఆర్‌ఎంవో అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు

మంథని: మండలంలోని పుట్టపాక గ్రామంలో మంగళవారం ద్విచక్రవాహనం అదుపుతప్పి, ఎంజాల కుమార్ కుడి కాలు, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది వంశీధర్‌రెడ్డి, హబీబ్ ప్రథమ చికిత్స చేస్తూ అంబులెన్స్‌లో పెద్దపల్లిలోని ఆసుపత్రికి తరలించారు.

కూతురుకు విషమిచ్చి.. తల్లి ఆత్మహత్య

- పాప పరిస్థితి విషమం



అపర్ణ మృతదేహం

రామగిరి(మంథని): నవమాసాలు మోసి.. కని పెంచిన కూతురుకు విషమిచ్చి.. తానూ క్రిమి సంహారక మందు తాగింది. ఈ ఘటనలో తల్లి చనిపోయింది. కూతురు పరిస్థితి విషమంగా ఉంది. ముత్తారం మండలం ఓడేడ్‌లో మంగళవారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నరాల రమేశ్–అపర్ణ (26) దంపతులకు కూతురు గాయత్రి (17 నెలలు) ఉంది. కుటుంబ సభ్యులు పొలం పనులకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో కూతురు గాయత్రికి విషం తాగించిన అపర్ణ తానూ క్రిమిసంహారక మందు తాగింది. పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికొచ్చిన కుటుంబసభ్యులకు ఇద్దరూ అపస్మారక స్థితిలో కనిపించారు. వెంటనే వారిని కరీంనగర్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అపర్ణ మృతిచెందింది. గాయత్రి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి కారణాలు తెలియాల్సి ఉంది. ఈ విషయమై ముత్తారం ఎస్సై రాములును వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. ఆయన అందుబాటులోకి రాలేదు. మృతురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేస్తేగానీ కారణాలు తెలియవని గ్రామస్తులు చెబుతున్నారు.

నర్స్ బలవన్మరణం

కరీంనగర్‌క్రైం: ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పని చేస్తున్న నర్స్ ఆత్మహత్య చేసుకుంది. కరీంనగర్ టూటౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని గాంధీరోడ్‌లో నివాసముంటున్న కొయ్యడ శ్యామల(35)కు 2007లో వివాహమవగా ఒక పాప ఉంది. తర్వాత ఆమెకు భర్తతో విడాకులయ్యాయి. శ్యామల నర్సింగ్ కోర్సు చేస్తున్న సమయంలో జైభీంతో ఏర్పడిన పరిచయం సహజీవనానికి దారితీసింది. ఆమె ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నర్స్‌గా పని చేస్తోంది. శ్యామలను పెళ్లి చేసుకుంటానని నమ్మించిన జైభీం మరొకరిని చేసుకున్నాడు. అప్పటినుంచి శ్యామలను వేధింపులకు గురిచేస్తున్నాడు. గత నెల 27న రాత్రి ఇద్దరికీ గొడవ జరిగింది. మనస్తాపానికి గురైన ఆమె అదే రాత్రి ఫ్యాన్‌కు ఉరేసుకుంది. స్థానికులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. జైభీం వేధింపుల వల్లే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లి రాజమ్మ మంగళవారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

మైనింగ్‌లో గొప్ప ఆవిష్కరణలు చేయాలి

- ఐఈఐ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి
- బొగ్గు వేలం, ప్రభుత్వ సంస్థల్లో అవకాశాలపై సెమినార్



మాట్లాడుతున్న ఐఈఐ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

రామగిరి(మంథని): మైనింగ్‌లో గొప్ప ఆవిష్కరణలు చేయాలని రామగుండం లోకల్ చాప్టర్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్(ఐఈఐ) చైర్మన్, వకీల్‌పల్లి మైన్స్ గ్రూపు ఏజెంట్ కాంరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం సెంటనరీకాలనీలోని మంథని జేఎన్‌టీయూహెచ్ కళాశాలలో బొగ్గు వేలం, ప్రభుత్వ సంస్థల్లో అవకాశాలు, ప్రతిబంధకాలపై సెమినార్ నిర్వహించారు. మైనింగ్‌లో ప్రతీరోజు కొత్త విషయాలు తెలుస్తాయన్నారు. ఎన్నో ఛాలెంజ్‌లు ఎదురవుతుంటాయని, వాటిని అధిగమిస్తూ ముందుకుసాగాలని పేర్కొన్నారు. సింగరేణి అధికారులు వివిధ అంశాలపై మాట్లాడారు. మైనింగ్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మార్చి 24 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు హైదరాబాద్‌లో ఫస్ట్ ఎయిడ్ ట్రైనింగ్ క్లాసులు ఏర్పాటు చేస్తున్నట్లు చైర్మన్ తెలిపారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు తన్నీరు వెంకటేశ్వర్‌రావు, కొప్పుల వెంకటేశ్వర్లు, జేఎన్‌టీయూ కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి, ఐఈఐ ప్రతినిధులు బ్రహ్మారెడ్డి, ఎంఎస్ వెంకట్రామయ్య, 11ఏ గని ఏజెంట్ చిలుక శ్రీనివాస్, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఓసీపీ-1లో 32 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి



మాట్లాడుతున్న జీఎం టీవీ రావు, పక్కన అధికారులు

- నెల రోజుల ముందుగానే లక్ష్యాలు పూర్తి
- ఆర్జీ–3 జీఎం టీవీ రావు

గోదావరిఖని(రామగుండం): సమష్టి కృషితోనే ఓసీపీ–1 ప్రాజెక్టు వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను నెల రోజుల ముందుగానే పూర్తి చేసినట్లు ఆర్జీ–3 జీఎం టీవీ రావు తెలిపారు. మంగళవారం ఓసీపీ–1 ఏజెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలోనే ఓసీపీ–1 కీలకమైన ప్రాజెక్టు అన్నారు. ఇక్కడ నిర్దేశిత లక్ష్యాలను ముందుగా సాధించడం ఆనవాయితీ వస్తోందని పేర్కొన్నారు. ఉద్యోగులు రాబోయే రోజుల్లోనూ ఇదే స్ఫూర్తితో ముందుకుసాగాలని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 28.47 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాల్సి ఉండగా, గత నెల 28 నాటికి 32.06 లక్షల టన్నులు సాధించినట్లు తెలిపారు. సమావేశంలో ప్రాజెక్టు అధికారి రాధాకృష్ణ, గని మేనేజర్ ఉదయ్‌హరిజన్, ప్రాజెక్టు ఇంజినీర్ శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ విలాస్ పోద్దార్, డీవైపీఎం రవీందర్‌రెడ్డి, సీనియర్ పీవో సునీల్‌ప్రసాద్ పాల్గొన్నారు.